ప్రజాశక్తి

గురువారం 22 మే 2025 | 5 | అనంతపురం

'చంద్రబాబు'వి డైవర్షన్ పాలిటిక్స్

కక్ష సాధింపులో భాగమే వైసీపీ నేతలపై కేసులు
ఎంపీ మిథున్ రెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎంపీ మిథున్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లా వైసీపీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం అనంతపురం విచ్చేశారు. స్థానిక అలెగ్జాండర్ హోటల్లో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్ళించేందుకే వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎటువంటి ఆధారాలు లేకున్నా కట్టు కథలు అల్లి కక్షపూరితంగా మద్యం కేసులు పెడుతున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలకు మంగళం పాడుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేసే విధంగా ఉన్న అన్నింటిని రద్దు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే వారిపై కేసులు పెట్టి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల్లో తిరుగుబాటు రాక తప్పదని హెచ్చరించారు. వైసీపీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టామని చెప్పారు. అందులో భాగంగానే అనంతపురం జిల్లాలోని ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత పటిష్టం చేసే విధంగా శ్రేణులను సన్నద్ధం చేస్తున్నామనివివరించారు .ఈ సమావేశంలో వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఉష చరణ్ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రజాసమస్యలపై నామమాత్రంగానే చర్చ
ముగ్గురు ఎమ్మెల్యేలొచ్చారు.. ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఫొటో మార్చి వెళ్లారు...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా ముగిసింది. పట్టుమని రెండు గంటలు కూడా సమస్యలపై చర్చింకుండానే సమావేశాన్ని మమ అనిపించేశారు. ముఖ్య ప్రజాప్రతినిధులెవ్వరూ ఈ సమావేశానికి హాజరవలేదు. హాజరైన ముగ్గురు ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్.రాజు, దగ్గుపాటి వెంకట ప్రసాద్‌లు కూడా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఛాంబరులోకెళ్లి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫొటోను తీసేసి, ఎదురుగా గోడకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫొటోను ఛైర్‌పర్సన్ ఛైర్ వెనుక గోడను అంటించి వెళ్లారు. తక్కిన ఎమ్మెల్యేలు, ఎంపీలెవ్వరూ ఈ సమావేశానికి హాజరవలేదు. జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ కూడా అరగంట ఆలస్యంగా సమావేశానికి హాజరయ్యారు. దీనిపై కొందరు సభ్యులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎప్పుడో ఒకసారి జరిగే ఈ సమావేశాలకు కూడా ఉన్నతాధికారులు హాజరుకాకపోతే తమ సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని పలువురు జడ్పిటిసిలు, ఎంపిపిలు తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారంఉదయం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశం ప్రారంభంలోనే దేశ సరిహద్దుల్లో పాక్ కాల్పుల్లో మృతి చెందిన జవాను మురళీనాయక్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. అనంతరం ఆర్డీటీకి ఎఫ్‌ఆర్‌సిఎ అనుమతి రాకపోవడంతో జిల్లాకు నష్టం జరుగుతుందని పలువురు సభ్యులు ప్రస్తావించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, ఎంఎస్.రాజు, దగ్గుపాటి వెంకట ప్రసాద్‌లు కూడా ఈ విషయంపై తమ మద్దతు తెలిపారు. ఇప్పటికే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీటీకి సానుకూలంగా ఫలితం వచ్చేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ మేరకు ఈ అంశంపై తీర్మానం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సవేరా చంపేస్తోంది : పలువురు సభ్యులు

అనంతపురం నగరంలో సవేరా ఆసుపత్రిలో వైద్యం సక్రమంగా అందివ్వటం లేదని శెట్టూరు జడ్పిటిసి ఆరోపించారు. తమ ప్రాంతానికి చెందిన ఒక యువకుడికి సవేరాలో ఆసుపత్రికి వస్తే గుండెజబ్బు ఉందని చికిత్స అందివ్వాలని చెప్పారన్నారు. అయితే ఇక్కడ కాకుండా అదే వ్యక్తిని బెంగళూరులో చికిత్సకు తీసుకెళితే ఆ యువకుడికి గుండెజబ్బే లేనట్టు తేల్చారన్నారు. ఇలా తప్పుడు వైద్యం అందించి ప్రజలను దోచేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దీనికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కూడా మద్దతు తెలిపారు. అనవసరమైన పేర్లతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కలెక్టరు వినోద్ కుమార్ స్పందిస్తూ ఆరోపణలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో వసతులున్నా వైద్యులను నియమించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వజ్రకరూరు జడ్పిటిసి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఛైర్మన్ నాగరత్న మాట్లాడుతూ నార్పల ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ ఉన్నా గర్భిణులకు స్కానింగు చేసే వైద్యుల్లేకపోవడంతో యంత్రం వృధాగా ఉందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదన్నారు. దీనిపైన అధికారులు స్పందిస్తూ ఒక మహిళా డాక్టరును నియమించామని, త్వరలో అక్కడిక వస్తారని చెప్పారు.

ఉపాధి హామీలో అక్రమాలు జరుగుతున్నాయి

ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలు జరుగుతున్నాయని పలువురు జడ్పిటిసిలు ఆరోపించారు. పనులకు రాకున్న వారి పేరు మీద కూడా బిల్లులు చెల్లిస్తున్నారని కంబదూరు జడ్పిటిసి ఆరోపించారు. అదే విధంగా నాటని మొక్కలను నాటి నట్టు చూపించి రూ.30 లక్షలు దోచేశారని ఆధారాలతో అందజేస్తామని చెప్పారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని కలెక్టరు ఆదేశించారు.

టిడిపి నేతలు సిఫారసు చేస్తేనే పథకాలు...

టిడిపి నేతలు సిఫారసు చేస్తేనే పథకాలు వర్తింపజేస్తామని స్వయంగా తాము వెళ్లినా అధికారులు ఇదే చెబుతున్నారని బుక్కరాయసముద్రం జడ్పిటిసి ఆరోపించారు. అటువంటివి ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు వినోద్ కుమార్ చెప్పారు.

జెడ్పీ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో మాజీ సిఎం ఫొటో

అభ్యంతరం వ్యక్తం చేసిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ ఛాంబర్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫోటో ఉండటంపై ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశానికి టిడిపి ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్ , ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ చాంబర్లో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఫోటో ఉండటాన్ని గమనించారు. అదే సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటో స్టోర్ రూమ్ పక్కన ఉంచడాన్ని చూశారు. . వెంటనే జెడ్పి డిప్యూటీ సీఈవోను పిలిపించి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ నిబంధన ప్రకారం మాజీ ముఖ్యమంత్రి ఫోటో పెడతారని ప్రశ్నించారు. వెంటనే అక్కడ జగన్మోహన్ రెడ్డి ఫోటో తీసి వేయించారు. జడ్పీ ఛాంబర్ నందు సీఎం చంద్రబాబు ఫోటోలు పెట్టించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రభుత్వం మారి 11 నెలలు గడుస్తున్నా ఇంకా కొంతమంది అధికారులు వైసిపి అధికారంలో ఉందన్న భ్రమలో ఉన్నారని విమర్శించారు. ఇకపై ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా ఇలా కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్, డిప్యూటీ మేయర్ ఛాంబర్ల నందు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలను తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ ఏర్పాటు చేసారు.

జెడ్పీ డిప్యూటీ సిఇఒను నిలదీస్తున్న ఎమ్మెల్యేలు

చెరువుల పునరుద్ధరణకు చర్యలు

కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లోని నిర్వహించిన జిల్లా స్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో చెరువుల పునరుద్ధరణ, నవీకరణ పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న చెరువులు బలోపేతానికి చర్యలు చేపట్టడం జరుగుతోందని, ఇందులో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన 411 చెరువులు, అనంతపురం జిల్లాకు సంబంధించి 96 చెరువులు ఉన్నాయన్నారు. వీటిని పూర్వస్థితికి తీసుకురావడంలో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టడం జరుగుతోందని, ఇందుకు జిల్లాలో చెరువులను గుర్తించి తగిన ప్రతిపాదనలను రాష్ట్ర కమిటీకి పంపించాలని చెప్పారు. ఇప్పటికే 29 చెరువులను గుర్తించడం జరగగా, మిగిలిన చెరువులను కూడా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పండమేరు పైభాగాన, మరవవంక, నడిమివంక పైభాగాన ఉన్న చెరువులను కూడా ఇందులో ఎంపిక చేసి ఆయా చెరువులను కూడా బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, డ్వామా పీడీ సలీంబాషా, గ్రౌండ్ వాటర్ డీడీ తిప్పేస్వామి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, మైనర్ ఇరిగేషన్ ఈఈ రాము, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ అధికారి స్వరూప్ కళ్యాణ్, కేంద్రీయ జల సంఘం ఏడీ సిహెచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

90శాతం సబ్సిడీతో వేరుశనగ పంపిణీ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-శింగనమల

ఖరీఫ్ సీజన్‌లో 90శాతం సబ్సిడీతో రైతులకు వేరుశనగ కాయలు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద ఒకేసారి రూ.20 వేలు రైతుల అకౌంట్లో జమ చేయాలన్నారు. హెచ్చెల్సీ చివరి ఆయకట్టు సలకం చెరువు వరకూ సాగునీరు అందించడంతోపాటు కాలువ వెడల్పు చేసి పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఇకపోతే ప్రతి రైతుకూ ఐదు బ్యాగులకు తక్కువ కాకుండా విత్తన కాయలు అందజేయాలన్నారు. అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పని చేసేచోట కనీస మౌలిక వసతులు కల్పించాలని, ప్రతి జాబ్‌కార్డుకూ 200 రోజులు పనులు కల్పించి, పెరిగిన ధరలకు కనుకూలంగా రోజు వేతనం రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనుల వద్ద ప్రమాదవశాత్తు చనిపోయిన కూలీలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలందరికీ బీమా సౌకర్యం కల్పించాలి కోరారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, కొండారెడ్డి, శ్రీనివాసులు, ధనాంజనేయులు, ఆంజనేయులు, వెంకటస్వామి, జయరాముడు, కుళ్లాయిస్వామి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ఏమిటీ దౌర్జన్యం

అనుమతి లేకుండా ఛాంబర్‌లోకి చొరబడతారా..: మేయర్

ప్రజాశక్తిఅనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లోని మేయర్ ఛాంబర్లోకి తెలుగుదేశం నేతలు చొరబడి గౌర్జన్యంగా ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి ఫోటోలను ఉంచటాన్ని మేయర్ మహమ్మద్ వసీం సలీం ప్రశ్నించారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో జగన్ ఫోటో ఉండటాన్ని తప్పుబడుతూ టిడిపి నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటనపై మేయర్ స్పందించారు. మేయర్ అనుమతి లేకుండా ఛాంబర్‌లోకి ఎలా వస్తారని ప్రశ్నించారు. టిడిపి నేతలకు ప్రొటోకాల్ తెలియదా.. అని నిలదీశారు. ఒకవేళ ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఫోటోలు పెట్టాలనుకుంటే కమిషనర్‌ను సంప్రదించాలే తప్ప దౌర్జన్యానికి దిగితే ఎలా అన్నారు. జెడ్పీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేల తీరును ఖండిస్తున్నామన్నారు. మహిళా ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లోకి అనుమతి లేకుండా వెళ్లకూడదన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా అనంతపురంలో కూడా అమలు చేస్తున్నారా.. అని ప్రశ్నించారు.

లైన్‌మెన్లు లేక రైతుల ఇబ్బందులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో లైన్‌మెన్‌లు లేకపోవడంతో రైతులు, విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వేసవి కాలం కావడంతో బోర్ల నుంచి అరకొర నీరు వస్తోంది. ఈనేపథ్యంలో విద్యుత్ కోతలు విధిస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. మండలంలో పుట్లూరు, తక్కల్లపల్లి, గాండ్లపాడు, మడ్డిపల్లి, చలివేముల తదితర పంచాయతీలకు సంబంధించిన లైన్‌మెన్ లేకపోవడంతో పొలాల వద్ద ఫీజులు పోతే వేసే వారు కూడా కరువయ్యారని రైతులు వాపోతున్నారు. దీనికితోడు ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో ఎక్కడ పడితే అక్కడ కరెంటు వైర్లు తెగి పడుతున్నాయి. విద్యుత్ అధికారులకు చెబుదామనుకుంటే వినేవారు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని అంటున్నారు. తోటల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫారం మరమ్మతులు చేసుకోవాలంటే రోజుల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి లైన్‌మెన్‌లను నియమించాలని మండల ప్రజలతోపాటు రైతులు కోరుతున్నారు.

ధైర్యం లేనోడికి బహిరంగ సవాళ్లెందుకు..?

చెప్పుకునే దమ్ములేకే శివరామిరెడ్డి పలాయనం
మరోసారి ముఖ్యమంత్రిని నిందిస్తే ఖబడ్దార్
ప్రభుత్వ విప్ కాలవ ఫైర్

జీడిపల్లి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్, బెళుగుప్ప

బహిరంగ చర్చకు రావటానికి ధైర్యం లేనోడికి బహిరంగ సవాళ్ళేందుకని వైసిపి నేత శివరామిరెడ్డి పై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఫైర్ అయ్యారు. ఐదేళ్ల వైసిపి పాలనలో హంద్రీనీవా పనుల పై నిర్లక్ష్యాన్ని ఎండగడతారనే భయంతోనే శివరామిరెడ్డి ఉరవకొండ నుండి పలాయనం చిత్తగించారని విమర్శించారు. ప్రజా సమక్షంలో చెప్పుకోలేని వారు మరోసారి తమనేత, ముఖ్యమంత్రి చంద్రబాబు క్రియాశీలతను సందేహించినా, లేనిపోని అభాండాలు వేయాలని ప్రయత్నించినా సహించేదిలేదని హెచ్చరించారు. కాలవ శ్రీనివాసులు, శివరామిరెడ్డి చేసుకున్న సవాల్ మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు జీడిపల్లి రిజర్వాయర్ వద్దకు కాలవ చేరుకున్నారు. తమ అభిప్రాయాలు తెలియచేయటానికి వీలుగా ప్రత్యేక వేదిక ఏర్పాట్లు చేయించారు. ఛాలెంజ్ స్వీకరించిన శివరామిరెడ్డి కోసం మధ్యాహ్నం ఒంటిగంట వరకు అక్కడే ఎదురు చూసినా ఆయన రాలేదు. ఉరవకొండ ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడి అటునుండి అటే వెళ్ళిపోయారు. ఈనేపథ్యంలో శివరామిరెడ్డి వైఖరిపై కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ మాత్రం ప్రజల్లో చెప్పుకోలేనోడికి ఛాలెంజ్ ఎందుకని నిలదీశారు. ఇది పెద్దమనిషి లక్షణమేనా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో హంద్రీనీవా ప్రాజెక్టు పనులు పూర్తిగా ఆగిపోయాయని ధ్వజమెత్తారు. రాయలసీమ దత్త పుత్రుడు నందమూరి తారక రామారావు ఆలోచన నుండే ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగిందని వివరించారు. 1996 లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వంలో వేగం పుంజుకొన్నాయని, అయితే అదే స్థాయిలో అవినీతి, అక్రమాలు జరిగాయని విమర్శించారు. 2014లో చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావడంతోనే ప్రాజెక్టు ఫలాలు ప్రజలకు చేరువయ్యాయని తెలియచేసారు. 700 క్యూసెక్కుల సామర్థ్యాన్ని రెండు వేల క్యూసెక్కుల సామర్థ్యానికి విస్తరింప చేశారన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో నిధులు ఖర్చుచేసి ప్రధాన, ఉపకాలువలతో పాటు రిజర్వాయర్ల నిర్మాణాలు 2019లోపు పూర్తి చేయించారన్నారు. ఫేజ్ 1, 2 పనులకు ప్రాధాన్యతనిస్తూ పనులు పరుగులు పెట్టించి అటు మడకశిర, ఇటు పుంగనూరు ఉప కాల్వలకు నీరివ్వగలిగారన్నారు. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తీరని ద్రోహాన్ని తలపెట్టిందని ఆరోపించారు. కాలువ వెడల్పు 6300 క్యూసెక్కుల పరిణామానికి పెంచుతామన్న నాటి ముఖ్యమంత్రి జగన్ గంపెడు మట్టి ఎత్తలేదని ఎద్దేవా చేశారు. వైసిపి నేతలు రాయలసీమ ద్రోహులుగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులుగా నాడు చెప్పుకొన్న ఆపార్టీ నేతలు తమ నేత చేస్తున్న ద్రోహాన్ని ఏనాడైనా ప్రశ్నించారా అని ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రత్యేక శ్రద్ధతో రూ.3700 కోట్ల నిధులు కేటాయించి పనులు చేయిస్తుంటే మెచ్చుకోకపోగా... విమర్శిస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, నీటిపారుదలశాఖ మంత్రి రామానాయుడు ప్రత్యేక దృష్టి పెడుతూ పనుల్లో ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త పడుతున్నారన్నారు. పనుల పర్యవేక్షణకు స్వయాన ముఖ్యమంత్రి చంద్రబాబే వచ్చారంటే ఆయనకు ఈ ప్రాజెక్టు ఎంత ప్రీతిపాత్రమో అర్థం అవుతుందన్నారు. కూటమి పాలనలో చంద్రబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న పనులతో ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి వైసిపి నేతలు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిష్టానం మెప్పుకోసం 'కాలవ' పాకులాట

ఇద్దరు ముఖ్యమంత్రులు చేసిన శంకుస్థాపన రాళ్ల వద్ద చర్చిద్దాం
దమ్ముంటే ఇక్కడికి రండి
వైసిపి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సవాల్

ఉరవకొండలో హంద్రీనీవా శిలాఫలకం వద్ద తమ పార్టీ నాయకులతో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ప్రజాశక్తి ఉరవకొండ

హంద్రీనీవా కాలువ అభివృద్ధి పనులపై చర్చ అంశంపై టీడీపీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, వైసిపి ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డిల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. జీడిపల్లి వద్ద వేదిక ఏర్పాటు చేశాను మీరు రండి అంటూ కాలవ శ్రీనివాసులు చెబుతుంటే.. ముందే చెప్పాం ఇద్దరు ముఖ్యమంత్రులు శంకుస్థాపన కోసం పునాదిరాళ్లు వేసిన దగ్గరే చర్చా వేదిక ఏర్పాటు చేద్దాం దమ్ముంటే ఇక్కడికే రండి అంటూ శివరామిరెడ్డి ఉరవకొండలో సవాల్ విసిరారు. చర్చకు కాలవ శ్రీనివాసులు ఉరవకొండకు రాకపోవడంతో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హంద్రీనీవా పనుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాల వద్దకు వెళుతుండగా అధికారులు అక్కడికి వెళ్లకుండా గేట్లు వేశారు. దీంతో శివరామిరెడ్డి గోడదూకి శిలాఫలకాల వద్దకు వెళ్లారు. అనంతరం హంద్రీనీవా పనుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన పునాదిరాళ్ల వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. హంద్రీనీవా కాలువ అభివృద్ధి పనులపై ఎవరి హయాంలో ఎంత జరిగాయో చర్చించడానికి 'మీ ఇంటికే వస్తాన'ంటూ చాలెంజ్ చేసిన కాలవ శ్రీనివాసులుకు ఆరోజే స్పష్టంగా చెప్పామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజశేఖర్ రెడ్డి హంద్రీనీవా కోసం పునాదిరాళ్లు వేసిన దగ్గర జగన్మోహన్ రెడ్డి నిరాహార దీక్ష చేసిన దగ్గర చర్చా వేదిక ఏర్పాటు చేయమని స్పష్టంగా చెప్పామన్నారు. అయితే ఇప్పుడు 'మీ నియోజకవర్గంలోనే పెట్టాను.. మీకోసం కుర్చీ వేశాన'ంటూ జీడిపల్లి దగ్గర మాట్లాడటం చూస్తుంటే ఆయనకు చెప్పడానికి విషయం చేతకాక. విషయం లేక ఇలా మాట్లాడుతున్నారని అర్థం అవుతుందన్నారు.. జీడిపల్లి వద్ద చర్చా వేదిక పెట్టుకుంటే అక్కడికి రావడానికి ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా లేవని ఆ ప్రాంతానికి రైతులు, ప్రజలు రావడానికి రవాణా సౌకర్యం సక్రమంగా లేదని అన్నారు. ఏ ప్రాంతంలో అయితే ఈ ప్రాజెక్టుకు నాంది పడిందో అక్కడే ఆ ప్రజలు, ఆ రైతుల సమక్షంలో బహిరంగ చర్చకు తాము సిద్ధమై వచ్చామన్నారు. ఇక్కడ బహిరంగ చర్చకు రావటానికి జంకుతున్న కాలవ శ్రీనివాసులు అధిష్టానం మెప్పు పొందడానికి పాకలాడుతూ అవాకులు, చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు 1996 ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రెండుసార్లు పునాదిరాళ్లు వేసి ఆ పునాదిరాయికి అటు కిలోమీటరు ఇటు కిలోమీటరు కాలవ తవ్వి కనీసం వారికి రూపాయి డబ్బులైన చెల్లించలేదని ఎద్దేవా చేశారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 40 టీఎంసీల నుంచి నాలుగు టీఎంసీలకు కుదించి జీవో ఇచ్చింది మీపార్టీవారు కాదా అని ప్రశ్నించారు. హంద్రీనీవా కాలువను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి చొరవతోనే ఈ హంద్రీనీవా కాలువ ఈరోజు ఈ స్థాయిలో ఉందన్న విషయం ఎవరు మర్చిపోకూడదన్నారు. రాజశేఖర్ రెడ్డి మృతి తర్వాత మిగతా నేతలు ఈ ప్రాజెక్టు పూర్తిచేసేలా చర్యలు చేపట్టి జీడిపల్లి రిజర్వాయర్ కు 700 క్యూసెక్కుల నీరు తీసుకురావడం నిజం కాదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం హంద్రీనీవా ఆధునీకరణ చేసి 6300 క్యూసెక్కుల నీటిని తరలించడానికి టెండర్లు పిలిచిందన్నారు. అయితే అప్పుడే ఎన్నికలు రావడంతో ఆ పనులు జరుగలేదన్నారు. ఇప్పడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ పనులను యధాతథంగా ఎందుకు కొనసాగించడం లేదని ప్రశ్నించారు. 6300 క్యూసెక్కుల సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు ఎందుకు తగ్గించారన్నారు. మొత్తం 216 కిలోమీటర్ల ఈ కాలువ మార్గానికి కేవలం రూ.700 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. ఈ పనుల్లో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని ఆరోపించారు. బహిరంగ చర్చా వేదికకు కాలవ శ్రీనివాసులు వస్తారని దాదాపు మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేచి చూసినా రాక పోవడంతో ఎమ్మెల్సీ శివరాం రెడ్డి తన స్వగ్రామానికి వెళ్లారు.

'కర్నాటక బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీ ఇవ్వండి'

కర్ణాటక రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కడప రీజినల్ ఛైర్మన్ నాగరాజు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

కర్ణాటక రాష్ట్రంలో కెఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు టికెట్లలో 25 శాతం రాయితీ ఇవ్వాలని ఎపిఎస్ ఆర్టీసీ కడప రీజినల్ ఛైర్మన్ నాగరాజు కోరారు. ఈమేరకు కర్ణాటక రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి, టిఎస్ఆర్టీసీ ఎండి నందినీదేవిని వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలో తిరిగే ఎపిఎస్ ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్స్కు 25శాతం రాయితీ వర్తింపచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరిగే కెఎస్ ఆర్టిసి బస్సుల్లో సీనియర్ సిటిజన్స్కు రాయితీ కల్పించాల్సిన విషయంపై విజ్ఞప్తి చేశారు. ఎపిఎస్ ఆర్టీసీ జారీ చేసిన సూచనల ప్రకారం ఏసీ బస్సుల నుండి అన్ని రకాల సర్వీసుల్లో సీనియర్ సిటిజన్లకు బస్సుఛార్జీల్లో 25శాతం రాయితీని వర్తింపజేస్తున్నట్లు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ నడిచే కెఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో రాయితీ వర్తించడం లేదని పలువురు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు.

కాంట్రాక్టు పనులకు టెండర్లు వేసేవారేరీ..!

బిల్లుల చెల్లింపు ఆలస్యమే కారణం..

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం పురపాలక సంఘం ఏర్పాటు చేసే వేలంపాటల్లో పాల్గొనేవారే కరవయ్యారు. గతంలో వేలంపాటలు నిర్వహిస్తే కనీసం ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది పోటీలో పాల్గొనేవారు. టెండర్ మొత్తం కంటే.. టెండర్ అంచనా విలువ కన్నా చాలా తక్కువ మొత్తాన్ని టెండర్ ఫారంలో కనబరుస్తూ వారి టెండర్ను ఆమోదించేవారు. పనులు చేపట్టి పూర్తి చేశాక మున్సిపల్ అధికారులు బిల్లు మంజూరు చేసేవారు. అయితే రాష్ట్రంలో నగదు ప్రవాహ నిర్వహణ వ్యవస్థ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టం- సిఎఫ్ఎంఎస్) అమల్లోకి రావడంతో బిల్లుల చెల్లింపు మున్సిపల్ అధికారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చింది. ఈనేపథ్యంలో పనులు పూర్తి చేసిన గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులు పురపాలక సంఘం ఖాతా నుంచి సిఎఫ్ఎంఎస్ ఖాతాకు బదిలీ అయినప్పటికీ ఆ బిల్లులు ఎప్పుడు చెల్లింపునకు నోచుకుంటాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. నిత్యం ప్రజల నుంచి ఇంటింటి చెత్త సేకరించే ఆటోలకు డీజిల్ బిల్లులు రెండేళ్లకు పైగా పెండింగ్లో ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పురపాలక సంఘం పరిధిలో ఇంజినీరింగ్, ఇతర సేవా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లను బతిమాలి ఎవరో ఒకరితో టెండర్లను వేయించాల్సి వస్తోంది. టెండర్ల వేయడంలో పోటీ తగ్గింది. కేవలం ఒకే ఒక వ్యక్తి టెండర్ విలువ కంటే 0.01శాతం తక్కువ మార్జిన్తో టెండర్ వేస్తున్నారు. వాటినే గత్యంతరం లేని పరిస్థితులలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో అంగీకరించాల్సి వస్తోంది. కాగా అత్యవసర సేవలు, తాగునీటి సరఫరాకు ఉపయోగించే విద్యుత్ మోటార్లు కాలిపోతే తక్షణం వాటిని మరమ్మతు చేసి వెంటనే బిగించాల్సి వస్తోంది. ఇక్కడ కూడా నెలలు, ఏళ్ల తరబడి చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో మోటర్లు రిపేరు చేసేవారు ఆ పనులు చేసేందుకు ఆసక్తి కనపరచడం లేదు. ఇంజినీరింగ్ అధికారులు మోటారు రిపేరు చేసే వారిని బతిమాలి పనులు చేయించుకోవాల్సి వస్తోంది. ఒక్కో మోటార్ మరమ్మతుకు ఇంజినీరింగ్ అధికారులు రూ.లక్ష దాకా ప్రతిపాదనలు పెడుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుసుకోవచ్చు. గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో అప్పుచేసి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుండి బిల్లుల చెల్లింపు విధానం గతంలో మాదిరి సిఎఫ్ఎంఎస్ నుంచి తప్పించి పురపాలక సంఘానికి బాధ్యతను అప్పగించే పరిస్థితి వస్తుందని చెప్పినప్పటికీ అధికారికంగా ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. చేపట్టే పనులు నాణ్యతగా ఉండాలంటే టెండర్లో పోటీ ఉండాలి.. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలి... అప్పుడే సరసమైన ధరలకే టెండర్ పనులు అవుతాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

ఫొటోలపై కాదు.. అభివృద్ధిపై దృష్టి సారించండి

వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు జిల్లా అభివృద్ధిని మరిచిపోయి ఫొటోల మార్పు కోసం పాకులాడటం తగదని వైసిపి పంచాయతీ రాజ్ విభాగంగా రాష్ట్ర ప్రెసిడెంట్ వెన్నపూస రవీంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. అనంతపురం జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సమావేశానికి నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ముగ్గురు ఎమ్మెల్యేలు జెడ్పీ ఛైర్పర్సన్ బీసీ సామాజిక వర్గానికి చెందిన బోయ గిరిజమ్మ ఛాంబర్లోకి అనుమతి లేకుండా వెళ్లి అక్కడ ఉన్న మాజీ సిఎం జగన్ ఫొటోని చూసి దౌర్జన్యంగా అధికారులను భయభ్రాంతులకు గురి చేసి తీసివేయడం దేనికి సంకేతం అన్నారు.

టిడిపి ఎమ్మెల్యేలు, నాయకులు ఫొటోలపైన ఉన్న శ్రద్ధ జిల్లా అభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరిస్తే బాగుంటుందని సూచించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి 14 మంది ఎమ్మెల్యేలకు ఇద్దరు పార్లమెంటు సభ్యులకు ప్రజలు పట్టం కడితే జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైంది మాత్రం కేవలం ముగ్గురు శాసనసభ్యులే అన్నారు. హాజరైన వారు కూడా డైవర్షన్ పాలిటిక్స్ చేయాలన్న ఉద్దేశంతో ఫొటో స్టంట్ చేశారని విమర్శించారు. జిల్లావ్యాప్తంగా తాగు, సాగునీరు, హంద్రీనీవా రైతన్నల ఆత్మహత్యలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి హామీ పనులు, గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి వాటిపై జెడ్పీ సమావేశంలో చర్చించకుండా జగన్ ఫొటోపై రాద్ధాంతం చేయడం ఎంత వరకూ సమంజసమన్నారు. ఇప్పటికైనా టిడిపి ఎమ్మెల్యేలు ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేయడం మానుకుని జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

రోడ్డుపైకి మురుగు వదిలితే చర్యలు

డిపిఒ దేవదాస్

ప్రజలతో మాట్లాడుతున్న డిపిఒ దేవదాస్

ప్రజాశక్తి-కుందుర్పి

మురికినీరును ప్రధాన రహదారులపైకి వదిలితే కఠినమైన చర్యలు చేపడతామని డిపిఒ దేవదాసు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛభారత్ హరిత రాయబారులు పని చేస్తున్నారా.. లేదా.. రోజూ ఇంటి నుంచి చెత్త తీసుకెళ్తున్నారా.. అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కుందుర్పి ప్రధాన రహదారిలో మురికినీటిని రోడ్డుపై వదులుతుండటాన్ని గమనించి ఇంటి యజమానులకు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆయురారోగ్యాలతో ఉంటారన్నారు. అలాగే దుకాణాల్లో చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం కుందుర్పి మండల కేంద్రంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీశంకర్, డిప్యూటీ ఎంపిడిఒ హరికృష్ణ బాలాజీ, పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, హరీష్, నవీన్, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ పి.నాగేంద్ర, హరిత రాయబారులు, ప్రజలు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు, వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా పొగాకు నియంత్రణ పర్యవేక్షణ అధికారి జి.నారాయణస్వామి పిలుపునిచ్చారు. జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం హమాలీ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటినీ పొగాకు పదార్థాల రహితంగా మార్చాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయ చుట్టు పక్కల, పొగాకుకు సంబంధించిన దుకాణాలు, కార్యాలయ ఆవరణలో బీడీలు, సిగరెట్లు, గుట్కా, పాన్పరాగ్, ఖైనీ, జర్దా, మొదలగు పదార్థాలను నిషేధించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను పొగాకు రహిత ప్రాంతంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ బి.శ్రీరాములు, అర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రం ఆరోగ్య అధికారి డాక్టర్ సారిక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'పై అవగాహన

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ దివాకర్

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ సూచనల మేరకు బుధవారం అనంతపురంలోని ఎంపిడిఒ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో ఎంపిడిఒ దివాకర్ అధ్యక్షతన ఉపాధి కార్మికులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజశేఖర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలు, కనీస వేతనం, ప్రమాద బీమా వంటి అంశాలను వివరించారు. కార్మిక శాఖ డిసిఎల్ లావణ్య మాట్లాడుతూ వివిధ రకాల కార్మికులకు సంబంధించిన బీమా పని ప్రదేశాల్లో కనీస భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ ఎపిఒ నాంచారమ్మ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అర్హులైన ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ డెవలప్మెంట్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థినికి అవార్డు

అక్షయను అభినందిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పట్టణంలోని కెజిబివి పాఠశాలలో చదివిన విద్యార్థిని ఎన్.అక్షయను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో అక్షయ 600 మార్కులకు 587 మార్కులు సాధించింది. దీంతో ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో షైనింగ్ స్టార్ 2025 అవార్డ్స్ పేరిట ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినికి బంగారు పతకంతోపాటు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని కెజిబివి ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, అక్షయ తల్లితండ్రులు మల్లికార్జున, గంగమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

తిరంగా ర్యాలీ

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తిరంగా ర్యాలీని తహశీల్దార్ పుణ్యవతి, ఎంపిడిఒ సొలమన్ బుధవారం జెండా ఊపి ప్రారంభిచారు. ఇందులో భాగంగా స్థానిక తహశీల్దార్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో ఎపిఎం నారాయణస్వామి, బిజెపి, కార్యకర్తలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీల సమస్యలు పరిష్కరించాలి

డిఎం కార్యాలయం వద్ద ధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థలో పని చేసే హమాలీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, గౌరవాధ్యక్షులు ఆర్వి నాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం స్థానిక డిఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 జనవరి నుంచి పెరిగిన వేతనం, అరియర్స్ అమలు చేయాలని, ప్రతి సంవత్సరం దసరాకు ఇచ్చే దుస్తులు, కుట్టేందుకు కూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దాదాపు మూడు నెలలు కిందట జీవో 14 విడుదల చేసిందన్నారు. వీటికి అనుగుణంగా పౌరసరఫరాల సంస్థ డిఎం సర్కులర్ నెంబరు 6 గత మార్చి నెలలోనే విడుదల చేసి హమాలీలకు అరియర్స్, దుస్తులు అన్ని ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే మూడు నెలలుగా డిఎం ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నప్పటికీ అమలు చేసిన పాపానపోలేదన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇందుకు డిఎం స్పందిస్తూ వచ్చే శనివారం లోపు సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణస్వామి, శంకర్, అనంతపురం అర్బన్, రూరల్ స్టాక్ పాయింట్ మేస్త్రీలు నారాయణస్వామి, ముని, ఇమాములు, శింగనమల స్టాక్ పాయింట్ మేస్త్రీ అక్కులప్ప, రాయదుర్గం మేస్త్రీ నాగరాజు, కళ్యాణదుర్గం మేస్త్రీ రామచంద్ర, కంబదూరు మేస్త్రీ విజయ్, గుత్తి మేస్త్రీలు శీనా, రామాంజి, యాడికి మేస్త్రీ చిన్న హనుమంతు, హమాలీలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అక్రమాలను అరికట్టాలని వినతి

తహశీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల సమీపంలోని జగనన్న కాలనీలో చోటు చేసుకున్న అక్రమాలను నివారించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నాగేంద్ర మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో భూ కబ్జాలు ఎక్కువయ్యాయన్నారు. దీనికితోడు ప్రభుత్వ స్థలాలను సైతం కబ్జా చేస్తున్నారన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని సిద్ధలాపురం వెళ్లే దారిలో ఉన్న పెద్ద పాదాల వద్ద ఉన్న 7వ జగనన్న కాలనీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారన్నారు. వెంటనే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ పుణ్యవతి స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించుకున్నా తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాగేంద్ర, వెంకటకొండ, వెంకటేశు, రాము, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం రూరల్ : రెండు కోర్సుల్లో నాలుగు నెలల పాటు నిర్వహించే ఉచిత శిక్షణ దరఖాస్తు చేసుకోవాలని పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్, ఎస్డిసి, పిఎంకెవివై 4.0 మొదటి విడతలో భాగంగా రాయదుర్గంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్ హబ్ సెంటర్లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో నాలుగు నెలల ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్.. 91829 20381 నెంబర్ను సంప్రదించాలన్నారు.

నేడు అన్నదానం

నార్పల : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం నార్పల పాత పోలీస్స్టేషన్ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద అన్నదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

పెద్దవడుగూరు : మండలంలోని ప్రసిద్ధిచెందిన కోటకొండ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం జరిగే హనుమజ్జయంతి వేడుకలకు ఆలయం ముస్తాబు చేశారు. కోటకొండతో, మల్లేనిపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ఆచరించునున్నారు.

మట్టి వేశారని ఫిర్యాదు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని కదరంపల్లి గ్రామంలో జయన్న అనే వ్యక్తి రోడ్డుకు అడ్డంగా మట్టి వేశాడని హనుమంతప్ప తదితరులు ఎంపిడిఒ కొండయ్యకు బుధవారం ఫిర్యాదు చేశారు. వర్షాలు పడుతుండడంతో ఇబ్బందిగా ఉందని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పైప్లైన్ మరమ్మతుల పరిశీలన

రాయదుర్గం రూరల్ : పట్టణానికి సరఫరా చేసే తాగునీటి పైప్లైన్ రాతిబావి దగ్గర చేపట్టిన మరమ్మతులను మున్సిపల్ ఛైర్పర్సన్ శిల్ప బుధవారం పరిశీలించారు. మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నిజాముద్దీన్, కో ఆప్షన్ సభ్యుడు నజీర్, మున్సిపల్ ఎఇ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్పర్సన్ శిల్ప

సైనికులకు రూ.10 లక్షల విరాళం

మొమెంటో అందుకుంటున్న ఎస్ఆర్ఐటి కళాశాల ఛైర్పర్సన్ జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

దేశ రక్షణ కోసం నిరంతరం ప్రాణాలను తృణప్రాయంగా భావించి సేవలందిస్తున్న భారత సైనికులకు కృతజ్ఞతగా శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి) తరపున రూ.10 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఐటి కళాశాల ఛైర్పర్సన్, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైస్ఛైర్మన్ ఎం.రంజిత్రెడ్డితో కలిసి హైదరాబాద్లోని తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియాకు చెందిన ప్రముఖ సైనికాధికారులు బ్రిగేడియర్ నంజుండేశ్వర ఎన్వి, కల్నల్ వి.సురేష్గౌడ్ సమక్షంలో విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం పని చేసే ప్రతి సైనికుడికి మనం రుణపడి ఉంటామన్నారు. ఈ విరాళం తమ కళాశాల తరపున అర్పించిన ఒక చిన్న నివాళి మాత్రమే అన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి : ఎస్ఐ

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ విజయ్కుమార్

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని శోదనపల్లి గ్రామంలో వెలసిన ఆగులూరప్ప తిరుణాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ విజయ్కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని శోదనపల్లి గ్రామంలో ఆగులూరప్ప, యల్లమ్మ స్వాముల ఏర్పాట్లను ఎస్ఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తిరుణాలకు పలు మండలాల నుంచి గుడికట్లు వస్తున్న నేపథ్యంలో ఊరేగింపులో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా భోజనశాల వద్ద తోపులాట లేకుండా చూసుకోవాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు మరమ్మతులు చేయాలని వినతి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గుడిపల్లి గ్రామానికి చెందిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నందకిశోర్కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బాలప్ప, గోవిందు, దేవేంద్ర, మంజప్ప, గోవిందుడు, మల్లికార్జున, హనుమంతు, తిమ్మప్ప మాట్లాడుతూ గుడిపల్లి నుంచి ముద్దులాపురానికి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలు ఏర్పడి వాహన రాకపోకులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. గుంతల వల్ల వాహనదారులు, కాలినడకన వెళ్లే బాటసారులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇందుకు ఎంపిడిఒ స్పందిస్తూ ఆ గ్రామ సర్పంచుతో మాట్లాడి రహదారి మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

విలేజ్ సెంటర్ సందర్శన

అనంతపురం : నగరంలోని రుద్రంపేట-1 విలేజ్ హెల్త్ సెంటర్ను మాతా శిశు ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ బుధవారం సందర్శించారు. ఇందులో భాగంగా ఆరోగ్య శాఖ ద్వారా అందించే టీకాలు, ఆర్సిహెచ్ సేవలు, యువిన్ పోర్టల్ ఎంట్రీలు, ఒపి రిజిస్టర్లు, ఎఎన్ఎంలకు సంబంధించిన సేవలతోపాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొద్దిపాటి లోపాలను గుర్తించి సేవలను మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగించారు. అనంతరం ఎఎన్ఎం రమాదేవి సేవలను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

పోస్టర్లు విడుదల

అనంతపురం : ఈనెల 21 నుంచి జూన్ 21 వరకూ నిర్వహించనున్న యోగాంధ్ర క్యాంపెయిన్కు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఉపకులపతి బి.అనిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ రమేష్బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధర్రావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, సిడిసి డీన్ కె.రామగోపాల్, ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, రూసా డైరెక్టర్ బి.రవిప్రసాద్రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

అనంతపురం క్రైం : నగరంలోని 4వ పట్టణ పోలీస్స్టేషన్లో ఉన్న 18 ద్విచక్ర వాహనాలను ఈనెల 23వ తేదీ శుక్రవారం వేలం వేయనున్నట్లు సిఐ కనుమూరి సాయినాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వేలంపాటపై అదనపు సమాచారం కావాలంటే ఎస్ఐ కె.ప్రసాద్ సెల్..93469 17088, సిఐ కె.సాయినాథ్ సెల్.. 93460 10581, కానిస్టేబుల్ ఎం.హనుమంతు సెల్.. 98660 84827 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జెఎన్టియు బీ.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీ.ఫార్మసీ 4వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.19) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఆర్.15 సప్లిమెంటరీ బుధవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగ ప్రసాద్నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి శివకుమార్, అడిషనల్ కంట్రోలర్లు జి.శంకర్ శేఖర్రాజు, ఎం.అంకారావు, ఎస్.శ్రీధర్ తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం www.jntuaresults.inను సంప్రదించాలని కోరారు.

వేరుశనగ ప్రాసెసింగ్ ప్లాంట్ తనిఖీ

అనంతపురం : ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని ఖరీఫ్ సీజన్కు సంబంధించి రైతులకు సబ్సిడీపై పంపిణీ చేయనున్న వేరుశనగ విత్తనకాయల ప్రాసెసింగ్ ప్లాంట్ను అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఇన్ఛార్జిలు అందరూ ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్సిడీ వేరుశెనగ విత్తనకాయలు నాణ్యత ఉన్న వాటిని మాత్రమే ప్యాకింగ్ చేసి సరఫరా చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఇన్ఛార్జిలు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఉత్సవానికి విరాళం


విరాళం అందజేస్తున్న నిర్మలమురళి

అనంతపురం : హనుమాన్ జయంతి సందర్భంగా అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో బసవ తారకనగర్లో ఉన్న నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న ఉత్సవాలకు నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం నిర్వాహకులు బుధవారం రూ.10వేలు విరాళం అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు సాయి ఆదిత్య కన్స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ సహకారంతో ప్రత్యేక పూజలు, అలంకారాలు చేసేందుకు విరాళం అందించారు. స్వయంపాక, అన్నప్రసాద వితరణకు మరో రూ.5వేల విలువజేసే నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శశికళ, అనంతమ్మ, అనంతప్ప, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి ప్లాంటు ఏర్పాటుకు భూమిపూజ

నార్పల : మండల పరిధిలోని సిద్ధరాచార్ల గ్రామ పంచాయతీ దుర్గం గ్రామంలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన పథకం కింద ఏర్పాటు చేసిన సురక్షిత మంచినీటి ప్లాంటు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, సర్పంచు సాకే రామాంజనేయులు, ఆర్డబ్లుఎస్ ఇంజినీర్ జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేష్నాయుడు, వార్డు మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామంలో సోదాలు

పెద్దవడుగూరు : ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని ఫ్యాక్షన్ గ్రామం చిన్నవడుగూరులో బుధవారం పోలీసులు సోదాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి అనుమానితులు, ఫ్యాక్షన్ నాయకుల ఇళ్లతోపాటు గడ్డివామి ఇతర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ ప్రదర్శన చేపట్టి ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి చర్చించారు. ఎవరూ ఫ్యాక్షన్ గొడవలకు వెళ్లక ప్రశాంత జీవనం సాగించాలని కోరారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం కలెక్టరేట్ : 2024-2025లో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎపి స్టూడెంట్ ఫెడరేషన్, ఇన్ స్పైయర్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర తెలిపారు. బుధవారం అనంతపురంలోని కోర్టు రోడ్డులో ఉన్న ఎపిఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25లో పదో తరగతిలో 550 మార్కులు పైన సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు సెల్ 9985012181, 8885012181 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్ స్పైయర్ కన్వీనర్ జిలాన్బాషా, ఎపి ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా కార్యదర్శి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఇన్ స్పైయర్ కో కన్వీనర్ గంగాధర్, శ్రీనివాసులు, గోపాల్రెడ్డి, నాయకులు గురుసాయి, సూరి, ఎపిఎస్ఎఫ్ నగర నాయకులు సిద్ధు, పవన్కుమార్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెస్ బిల్లుల వ్యవహారంపై విచారణ చేపట్టాలి

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో దాదాపు రూ.20 లక్షలకుపైగా స్వాహా విద్యార్థుల మెస్ బిల్లుల వ్యవహారంపై వెంటనే విచారణ చేపట్టాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని నీలం రాజశేఖర్రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో విద్యార్థుల మెస్బిల్లుల కాజేతపై వైద్య శాఖ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రిన్సిపాల్కు ఆదేశాలు జారీ చేసినా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. దీనిబట్టి చూస్తుంటే ఈ వ్యవహారంలో ప్రిన్సిపాల్ హస్తం ఉందా.. అనే అనుమానం వ్యక్తం అవుతోందన్నారు. ప్రిన్సిపాల్ తక్షణమే స్పందించి కాజేసిన మెస్ బిల్లుల డబ్బులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్, నగర కోశాధికారి నాని, సహాయ కార్యదర్శి సమీర్, నాయకులు ప్రవీణ్, దిలీప్, కౌశిక్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.